

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 28-03-2025 | సంపుటి - 22 | సంచిక - 334 | రూ : 4 | పేజీలు: 8




## ఉప్పల్.. తిప్పల్

- క్రికెట్ అభిమానులను నిరాశపరిచిన ఏర్పాట్లు

హైదరాబాద్: అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు వేదికైన ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వద్ద ఏర్పాట్లు నిరాశపరిచే విధంగా ఉన్నాయి. గురువారం స్టేడియం ప్రధాన ప్రవేశ ద్వారానికి ఎదురుగా భారీగా మురుగు నీరు నిలిచింది. అందులో నిల్చునే కొందరు అభిమానులు క్రికెటర్లకు అభివాదం చేస్తే.. ఇంకొందరు ఆ నీటిని దాటుకుంటూ స్టేడియంలోకి వెళ్లారు. హెచ్‌సీఏ.. ఈ అసౌకర్యాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం.

## నియోజకవర్గాల పునర్విభజన
# దక్షిణాదిపై దాడే



- ఆయా రాష్ట్రాలను నియంత్రించేందుకు కేంద్రం యత్నం
- దీనిపై కలిసికట్టుగా పోరాటం చేద్దాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీర్మానం.. అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్: "దేశంలో 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 నుంచి 19

తరువాయి 2లో



## ఆర్థిక శాఖలో జరిగినవన్నీ తప్పుతున్నా

- భారాస నేతల భవనాలకు అద్దెలు పెంచి గురుకులాలు పెట్టారు
- బడ్జెట్ పద్దులపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం
- బడ్జెట్‌కు సభ ఆమోదం, నిరవధిక వాయిదా

తరువాయి 2లో

## సీఏ విద్యార్థులకు బిగ్ అలర్ట్..

- ఇకపై ఫైనల్ పరీక్షలూ ఏడాదికి మూడుసార్లు



దిల్లీ: చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) పరీక్షలకు సంబంధించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ICAI) కీలక ప్రకటన చేసింది. 2025 నుంచి సీఏ ఫైనల్ పరీక్షల్ని సైతం ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం CA Final exams ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది మార్చిలో సీఏ ఇంటర్, ఫౌండేషన్ కోర్సు పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఐసీఏఐ.. తాజాగా సీఐ ఫైనల్ పరీక్షలను సైతం అదే తరహాలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

తరువాయి 2లో



## కానరాని మరో మేస్త్రీ ఆచూకీ

- భద్రాచలంలో కొనసాగుతున్న కూలిన భవన శిథిలాల తొలగింపు

భద్రాచలం, భద్రాచలం భద్రాచలం పట్టణం పోతులవారి వీధిలో బుధవారం కూలిపోయిన ఐదు అంతస్తుల భవనం శిథిలాల తొలగింపు చర్యలు గురువారం కొనసాగాయి. అయితే శిథిలాల కింద చిక్కుకుపోయిన తాపీ మేస్త్రీ పడిశాల ఉపేందర్ ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం అర్ధరాత్రి తాపీ కార్మికుడు చల్లా కామేశ్వరరావును శిథిలాల నుంచి బయటకు తీసి ఏరియా ఆసుపత్రికి తరలించగా.. మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉపేందర్‌ను రక్షించేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని.. ఆయన కుటుంబ సభ్యులు బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ వాహనాన్ని కొద్దిసేపు అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. గురువారం ఉదయం 8 గంటలకు మరోసారి ఉపేందర్ కుటుంబ సభ్యులు, బంధువులు గోదావరి బ్రిడ్జి పాయింట్‌లో రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.

తరువాయి 2లో

## ప్రత్యేక విమానంలో
# గుండె తరలింపు...



- నిరుపేదకు అమర్చేందుకు గన్నవరం నుంచి తిరుపతికి..
- మంత్రి లోకేశ్ సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం ఏర్పాటు
- గుంటూరులో బ్రెయిన్‌డెడ్ మహిళ నుంచి అవయవాల సేకరణ

గన్నవరం: విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఓ నిరుపేదకు గుండె అమరింది. గుంటూరులో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ నుంచి సేకరించిన గుండెను తిరుపతికి తరలించడానికి ఆయన తన సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి, సకాలంలో ఆసుపత్రికి చేరేలా చూశారు. గుంటూరుకు చెందిన గృహిణి చెరుకూరి సుష్మ (47) తీవ్ర తలనొప్పితో బాధపడుతూ.. ఈ నెల 23న గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్‌డెడ్ అయ్యారు. వైద్యులు జీవన్‌దాన్ ట్రస్టుకు సమాచారం ఇవ్వడంతో వారు సుష్మ కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానానికి ఒప్పించారు. సుష్మ నుంచి సేకరించిన గుండె, కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులను గుంటూరు, విజయవాడ, తిరుపతి, చెన్నైలలోని ఆయా ఆసుపత్రులకు జీవన్‌దాన్ ట్రస్టు కేటాయించింది.

తరువాయి 2లో



2లో

## శ్రీధర్‌బాబు వర్సెస్ మహేశ్వర్‌రెడ్డి

* అధికారం కోసం అనేక హామీలిచ్చారు..
* మంత్రివర్గంపై కేసులు పెట్టాలన్న ఏలేటి
* కేంద్రంపై ఏం కేసు పెట్టాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం



## అధునాతన నిఘా డ్రోన్‌ల వ్యవస్థను
# పరిశీలించిన కిమ్

సియోల్: ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ యుద్ధ డ్రోన్ల తయారీపై ప్రత్యేక దృష్టిసారించారు. తాజాగా ఆయన అత్యాధునిక నిఘా, దాడి డ్రోన్‌ల పరీక్షను పర్యవేక్షించారు. బోయింగ్ ఈ-7 వెడ్జ్ టెయిల్ యుద్ధ విమానాన్ని పోలి ఉన్న విమానాలు, శత్రువుల వాహనాల్లోకి చొరబడి దాడి చేయగల ఆత్మాహుతి

తరువాయి 2లో

## నిర్లక్ష్యం చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతా..

- పోలవరం గుత్తేదారులకు సీఎం హెచ్చరిక

2లో



# నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాదిపై దాడే

(మొదటిపేజీ తరువాయి)

శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. రాష్ట్రాలను నియంత్రించడానికి పునర్విభజనను వినియోగించుకోవాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా దక్షిణాది రాష్ట్రాలపై దాడి చేస్తోంది. ఇదే జరిగితే భవిష్యత్తులో మనతో సంబంధం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. దీనికి వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పునర్విభజన (డీలిమిటేషన్)కు వ్యతిరేకంగా గురువారం శాసనసభలో ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

*** జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు..**

''రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా పునర్విభజనపై కేంద్రం చేస్తున్న కసరత్తు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కేంద్రం ఆదేశాలను పాటించి జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. పునర్విభజనకు కేవలం జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు. ఎంపీ స్థానాలను యథాతథంగా ఉంచాలి. సరి హద్దుల్లో మార్పులు, చేర్పులు చేయాలి. ఎస్సీ, ఎస్టీలకు సీట్లు పెంచాలి. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లను తక్షణమే 153కు పెంచాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని కోరుతోంది. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే రాష్ట్రాల మధ్య అంతరం పెరుగుతుందని, సుహృద్భావం దెబ్బతింటుందని భావించి 1975 సమయంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 25 ఏళ్లపాటు వాయిదా వేశారు. 2002లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి కూడా రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పెరగవద్దని భావించి పునర్విభజనను వాయిదా వేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక పునర్విభజనపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ నిర్వహించిన సమావేశంలో కేంద్రం నిర్ణయం నష్టం కలిగిస్తే దాన్ని ఎదుర్కోవాలని నిర్ణయించాం. పునర్విభజనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ఆ ఆలోచనే లేదని కొందరు కేంద్ర మంత్రులు చెబుతున్నారు. వారు చెప్పేది అర్ధ సత్యాలే. రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాల నియంత్రణకు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. అదే జరిగితే బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో నియోజకవర్గాలు పెరుగుతాయి. దక్షిణాదిలో జనాభా నియంత్రణ వల్ల స్థిరీకరణ జరిగింది. జనాభా వృద్ధి రేటు 1.8 శాతమే ఉంది. ప్రస్తుతం 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో దక్షిణాది వాటా 24% ఉండగా.. పునర్విభజనతో 19 శాతానికి పడిపోయే అవకాశం ఉంది.

*** పన్నుల ఆదాయంలో తిరిగొచ్చేది తక్కువే..**

కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి 36 శాతం పన్ను ఆదాయం వెళ్తోంది. తిరిగొచ్చేది తక్కువ. తెలంగాణ నుంచి రూపాయి వెళ్తోంటే 42 పైసలు వెనక్కి ఇస్తున్నారు. బిహార్‌కు రూపాయికి రూ.6.06 ఇస్తున్నారు. యూపీకి రూ.2.73, మధ్యప్రదేశ్‌కు రూ.1.70 ఇస్తున్నారు. ఆర్థికంగా నష్టపోయినా పర్వాలేదని.. దేశాభివృద్ధిలో భాగస్వాములుగా మారాం. ఇప్పుడు రాజకీయంగా మన ప్రాతినిధ్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేం. అందుకే పునర్విభజనపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాం. 2002లో ప్రధాని వాజ్‌పేయి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నారో, లేదో చెప్పాలి. 2011 లేదా 2026 జనాభా ఆధారంగా పునర్విభజన చేపడితే భవిష్యత్తులో మనతో సంబంధం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి.

*** త్వరలోనే పార్టీలు, సంఘాలతో చర్చ..**

దక్షిణాది రాష్ట్రాలపై దాడి జరుగుతోందని అర్థమవుతోంది. కేంద్రంతో మాట్లాడదాం. అంగీకరిస్తే సరి. లేకుంటే పార్టీలకతీతంగా కలిసికట్టుగా పోరాటం చేద్దాం. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఏపీ, పుదుచ్చేరి సీఎంలకు విజ్ఞప్తి చేస్తున్నా. త్వరలో పునర్విభజనపై జానారెడ్డి, భట్టి విక్రమార్క, కేశవరావుల నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేయబోతున్నాం. భవిష్యత్తులో జరగబోయే నష్టాలపై చర్చిద్దాం. రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దాం. సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అందరూ మద్దతు పలకాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. అనంతరం.. పునర్విభజన (డీలిమిటేషన్)కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించిందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

*** ఇదే బాటలో మరిన్ని రాష్ట్రాలు**
**తమిళనాడు సీఎం స్టాలిన్**

నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో చేసిన తీర్మానం ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోతుందని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో స్టాలిన్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ.. సరైన రీతిలో పునర్విభజన కోరుతూ తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయి. హైదరాబాద్‌లో ఐక్య కార్యాచరణ సమితి రెండో సమావేశం జరగనున్న నేపథ్యంలో.. మరిన్ని రాష్ట్రాలు ఇదేబాటలో నడుస్తాయి. తమిళ నాడును అనుసరిస్తూ చేపట్టిన ఈ చర్య.. మన ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుంది. ఒక ప్రాంతానికి అన్యాయం చేసేలా దేశ భవిష్యత్తును రాసేందుకు ప్రయత్నించే వారెవర్నీ అనుమతించబోం'' అని స్టాలిన్ స్పష్టం చేశారు.

# ఆర్థిక శాఖలో జరిగినవన్నీ తవ్వుతున్నా

హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖలో గత పదేళ్లలో జరిగిన విషయాలన్నీ తాను తవ్వుతున్నానని, వాటి లెక్కలన్నీ సభ ముందు పెడతానని భారాస నేతలు ఆందోళన చెందుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శాసనసభలో గురువారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ... ''భారాస నాయకుల భవనాలకు అడ్డగోలుగా అద్దెలు ఖరారు చేసి వాటిలో గురుకులాలను పెట్టారు. ఏ జిల్లాలో, ఏ గురుకులం, ఏ నేత భవనంలో ఉందనే వివరాలన్నీ తెప్పించాం. భవనాల అద్దెలను ఏటా పెంచారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను మాత్రం పెంచలేదు. పైగా అద్దెలను కూడా పెండింగ్‌లో పెట్టారు. మేం వచ్చాక వాటిలో రూ.126 కోట్లు విడుదల చేశాం. దీర్ఘకాలిక అప్పుల పేరిట గత ప్రభుత్వం ఎక్కడపడితే అక్కడ అప్పులు తెచ్చి... వాటి ఫలాలను అనుభవించింది. రుణాలను తిరిగి తీర్చాల్సిన సమయం వచ్చే సరికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ అప్పులను క్రమంగా తీర్చుకుంటూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. వారి హయాంలో రూ.1,59,940 కోట్ల విలువైన పనులను మంజూరు చేశారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన రూ.40 వేల కోట్ల బిల్లులకు టోకెన్ నంబర్లు సిద్ధం చేసి ఉంచారు. మేం అన్ని శాఖల పెండింగు బిల్లులనూ వెసులుబాటును బట్టి చెల్లిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంజూరు చేసిన పనుల బిల్లుల విలువ రూ.ఐదారు వందల కోట్లకు మించి లేదు. భారాస వారి పనులకు సంబంధించినవే పెండింగులో ఉన్నాయి. ఇప్పుడు తమవారి కోసం తాపత్రయపడుతూ భారాస సభ్యులు మాపై నిందలేస్తున్నారు. మేం మీకంటే ఎక్కువ విమర్శలు చేయగలం. ఉద్యోగుల పింఛన్ బకాయిలు, పీపీఎఫ్ వంటివన్నీ కలిపి రూ.25 వేల కోట్ల బకాయిలుంటే రూ.16 వేల కోట్లను ఇప్పటికే చెల్లించాం. భారాస పదేళ్ల పాలనలో బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రూ.70,474 కోట్లు ఖర్చు పెట్టకపోవడంతో ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది. మేం అధికారంలోకి వచ్చాక వేతనాలకు రూ.80,106 కోట్లు, అప్పులు, వడ్డీలకు రూ.88,564 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.1,32,9096 కోట్లు ఖర్చు పెట్టాం.

*** సభ అంటే భయం ఉండాలి...**

సభ్యులకు సభ అంటే కొంత భయం ఉండాలి. ఆచితూచి మాట్లాడాలి. అప్పుడే నిజమైన చర్చలు జరుగుతాయి. ఏదిపడితే అది మాట్లాడుతూ సభను తప్పుదారి పట్టించకూడదు. నాంపల్లి అగ్ని ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలను ఆదుకుంటాం. ఫలక్‌నుమాలో భూమి మార్పిడి సీఎం పరిశీలనలో ఉంది. రుణమాఫీకి రూ.8 వేల కోట్లే ఇచ్చామని హరీశ్‌రావు అంటున్నారు. కానీ, ప్రతీ గ్రామంలో ఏ రైతుకు ఎంత మాఫీ అయిందో చెబుతూ డిస్‌ప్లే బోర్డులు పెట్టాలని చెప్పాం. గజ్వేల్‌లో రూ.238 కోట్ల రుణమాఫీ చేశాం. గ్రామాలవారీ రుణమాఫీ జరిగిన రైతుల పేర్లను ఎమ్మెల్యేలకు ఇస్తాం. ద్రవ్య వినిమయ బిల్లు (బడ్జెట్)ను ఆమోదించాలి'' అని భట్టి కోరారు. అనంతరం బడ్జెట్‌ను సభ ఆమోదించినట్లు సభాపతి ప్రసాద్‌కుమార్ ప్రకటించి నిరవధిక వాయిదా వేశారు.

# ప్రత్యేక విమానంలో గుండె తరలింపు



గన్నవరం: విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఓ నిరుపేదకు గుండె అమరింది. గుంటూరులో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ నుంచి సేకరించిన గుండెను తిరుపతికి తరలించడానికి ఆయన తన సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి, సకాలంలో ఆసుపత్రికి చేరేలా చూశారు. గుంటూరుకు చెందిన గృహిణి చెరుకూరి సుష్మ (47) తీవ్ర తలనొప్పితో బాధపడుతూ.. ఈ నెల 23న గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్‌డెడ్ అయ్యారు. వైద్యులు జీవన్‌దాన్ ట్రస్టుకు సమాచారం ఇవ్వడంతో వారు సుష్మ కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానానికి ఒప్పించారు. సుష్మ నుంచి సేకరించిన గుండె, కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులను గుంటూరు, విజయవాడ, తిరుపతి, చెన్నైలలోని ఆయా ఆసుపత్రులకు జీవన్‌దాన్ ట్రస్టు కేటాయించింది. అవయవాలను తిరుపతి, చెన్నై ఆసుపత్రులకు ఆకాశ మార్గంలో చేర్చాలని వైద్యులు నిర్ణయించారు. ఈ మేరకు గుంటూరు నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు రోడ్డు మార్గంలో ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసింది. తొలుత గురువారం రాత్రి 7.50 గంటలకు గుండెను ప్రత్యేక అంబులెన్స్‌లో పోలీసు ఎస్కార్ట్ సాయంతో తరలించారు. గన్నవరం నుంచి మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో తిరుపతిలోని రేణిగుంట విమానాశ్రయానికి తరలించారు. ఊపిరితిత్తులను చెన్నై ఆసుపత్రికి తరలించడానికి మరో ప్రత్యేక అంబులెన్స్‌లో గన్నవరం విమానాశ్రయం వరకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. ఒక కిడ్నీ, కాలేయాన్ని ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి ఇవ్వగా.. మరో కిడ్నీని విజయవాడలోని మరో కార్పొరేట్ ఆసుపత్రికి వైద్యులు తీసుకెళ్లారు. తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హృద్రోగ బాధితుడిది నిరుపేద కుటుంబమని తెలిసిన మంత్రి లోకేశ్ గతంలోనే అవయవదానం ద్వారా గుండె అమర్చాలని జీవన్‌దాన్ ట్రస్టుకు సూచించారు. సుష్మ శరీరం నుంచి గుండె సేకరించేటప్పటికి సాయంత్రం అవ్వొచ్చని, ఆ సమయంలో తిరుపతికి విమానం లేదని తెలుసుకున్న రమేష్ ఆసుపత్రి యాజమాన్యం లోకేశ్‌కు ఆ సమాచారం అందించింది. స్పందించిన ఆయన తన పేషీ అధికారులతో మాట్లాడించి, ప్రత్యేక విమానంలో తరలించడానికి ఏర్పాట్లు చేశారు.

*** లోకేశ్ స్పందన స్ఫూర్తిదాయకం: అయ్యన్నపాత్రుడు**

'గుంటూరులో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ గుండెను తిరుపతికి తరలించి, అక్కడ మరొకరికి అమర్చేందుకు సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం సిద్ధం చేయించడంతోపాటు, గ్రీన్ ఛానెల్‌ను ఏర్పాటు చేయించిన మంత్రి లోకేశ్ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు' అని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఒక్క మెసేజ్‌పై వేగంగా స్పందించి, ఒకరికి ప్రాణదానం కలిగేలా చేసిన లోకేశ్‌కు అభినందనలు' అని తెలిపారు.

# అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీ వద్దు

## సీజేఐకు బార్ అసోసియేషన్ల విజ్ఞప్తి

దిల్లీ: అధికారిక నివాసంలో నోట్ల కట్టల వివాదంలో చిక్కుకున్న దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపించవద్దని వివిధ బార్ అసోసియేషన్ల ప్రతినిధులు గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం సభ్యులకు విజ్ఞప్తి చేశారు. అలహాబాద్‌కు వర్మ బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. కేసుల విచారణ విధులతో పాటు ఇతర పాలనాపరమైన బాధ్యతలనూ జస్టిస్ వర్మకు అప్పగించవద్దని సూచించారు. న్యాయవ్యవస్థలో అవినీతిపరులను ఏరివేయాలని, నగదు దొరికిన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ వినతులను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీజేఐ జస్టిస్ ఖన్నా, కొలీజియం సభ్యులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్.ఓక్, జస్టిస్ విక్రమ్‌నాథ్ తెలిపారని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ వెల్లడించారు. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపటాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెను విరమించే విషయమై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులను కలిసిన వారిలో గుజరాత్, కేరళ, జబల్‌పూర్, కర్ణాటక, లఖ్‌నవూ హైకోర్టుల బార్ అసోసియేషన్ల నేతలూ ఉన్నారు.

## కానరాని మరో మేస్త్రీ ఆచూకీ

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం 9 గంటల నుంచి రెస్క్యూ బృందాలు.. శిథిలమైన భవన శ్లాబ్‌లను యంత్రాల సాయంతో తొలగింపు పనులు ప్రారంభించారు. అంతకుముందు విక్టిమ్ లోకేషన్ కెమెరాను శిథిలాల మధ్యకు పంపి పరిశీలించారు. 12 నుంచి 15 అడుగుల దూరంలో వ్యక్తుల కదలిక లేదా శ్వాస ఉంటే ఈ కెమెరా గుర్తిస్తుంది. కూలిన శ్లాబ్‌ల మధ్య కొంచెం కూడా ఖాళీ లేకపోవడంతో చిక్కుకున్న వారికి సంబంధించి స్పష్టమైన సమాచారం అధికారులకు చేరలేదు. పోలీసు జాగిలంతోనూ పరిశీలించినా ప్రయోజనం లేకపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, సింగరేణి బృందాలు శిథిలాల తొలగింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## నిర్లక్ష్యం చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతా..

(మొదటిపేజీ తరువాయి)

ఏలూరు: గోదావరి పుష్కరాల (2027)కు ముందే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసి, జాతికి అంకితం ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులు, గుత్తేదారులకు సూచించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలన అనంతరం ఆయన వారితో సమీక్ష నిర్వహించారు. ప్రధాన డ్యామ్, అనుసంధాన పనుల తదితర అన్ని పనుల గుత్తేదారులు హాజరయ్యారు. ఎడమ కాలువకు సంబంధించిన ఒక ప్యాకేజీ గుత్తేదారు హాజరు కాలేదు. దీంతో ప్రాజెక్టు పనులను సమయానికి పూర్తి చేయకుంటే గుత్తేదారులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు సైతం వెనుకాడనంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడమ కాలువ పనుల పురోగతిలో వెనుకబడటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కుమ్మరలోవ గ్రామాన్ని తరలించడంలో సమస్య ఉన్నందున మార్చిలోగా ఇబ్బందులను అధిగమించి, పనులు వేగవంతం చేస్తామని ఎడమ కాలువ అధికారులు సమాధానం ఇచ్చారు.

ప్రధాన డ్యాంతో పాటు, ఎడమ, కుడి కాలువలతో పాటు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎంత విలువైన పనులు ఉన్నాయని అధికారులను సీఎం ప్రశ్నించారు. దీనిపై అధికారుల దగ్గర సరైన లెక్కలు లేకపోవడంతో మీరు అన్ని లెక్కలతో సిద్ధంగా ఉండాలి కదా.. కేంద్రం నిధులు ఇస్తుందని అలసత్వం వద్దు అని హెచ్చరించారు. 45.72 కాంటూరు, పోలవరం డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించారు. పునరావాసంలో అవకతవకలకు తావు లేకుండా అర్హులందరికీ సాయం అందేలా, అనర్హులకు అవకాశం లేకుండా చేయాలని ఆదేశించారు. బట్రస్ డ్యాం పూర్తి చేసేందుకు రూ.82 కోట్లు, ప్రాజెక్టు అత్యవసర పనులకు రూ.400 కోట్లు, భూసేకరణ, పునరావాసానికి రూ.486 కోట్లు నిధులు అత్యవసరంగా కావాలని ఇంజినీరింగ్ అధికారులు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

**2025 నాటికే డయాఫ్రంవాల్ పూర్తి చేయాలి**

'2025 డిసెంబర్ నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేయాలి. ఈసీఆర్‌ఎఫ్‌గ్యాప్ 1 పనులు 2026 మార్చిలోగా పూర్తి చేయాలి. గ్యాప్ 2 పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం ఉన్నా.. పుష్కరాల కంటే ముందే 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలి. పాపికొండల వరకు ఉన్న కొండలను ఏ విధంగా అభివృద్ధి చేస్తారో కలెక్టర్లు ఆలోచించాలి. పర్యాటకులకు సౌకర్యంగా ఉండేందుకు పోలవరం దగ్గర ఓ రోడ్డు వంతెన, పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రాజెక్టు దగ్గర యూనిక్ వంతెన నిర్మాణంతో పాటు ఆయా ప్రాంతాల్లో హోటళ్లు అభివృద్ధి చేయాలి' అని చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## అధునాతన నిఘా డ్రోన్‌ల వ్యవస్థను పరిశీలించిన కిమ్

(మొదటిపేజీ తరువాయి)

డ్రోన్‌లను ఆయన పరిశీలిస్తున్న ఫొటోలను ఉత్తర కొరియా వార్తాసంస్థ గురువారం విడుదల చేసింది. భూమిపై, సముద్రంలో వ్యూహాత్మక లక్ష్యాలను, శత్రు కార్యకలాపాలను గుర్తించే సామర్థ్యం కలిగిన అత్యాధునిక నిఘా డ్రోన్‌ల పరీక్షను కిమ్ పర్యవేక్షించినట్లు మీడియా వెల్లడించింది. ''ఆయుధాల ఆధునికీకరణలో మానవరహిత అస్త్రాలు, కృత్రిమ మేధస్సు సాంకేతికతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. వీటి ఉత్పత్తులను మరింత పెంచాలి'' అని ఈ సందర్భంగా అధికారులను కిమ్ ఆదేశించినట్లు పేర్కొంది.

## శ్రీధర్‌బాబు వర్సెస్ మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంపై అప్పులభారం పాపంలో తొలి ముద్దాయి భారాస అయితే రెండో ముద్దాయి కాంగ్రెస్ అని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో గురువారం జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలిసి కూడా కాంగ్రెస్ పార్టీ అనేకానేక హామీలిచ్చిందని, ఇప్పుడు ఏ పథకాన్ని ఎత్తేస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంపై మోసం కేసు పెట్టాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇందులో తొలి కేసు కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌బాబుపైనే పెట్టాలన్నారు. దీనిపై శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. '2 కోట్ల ఉద్యోగాలిస్తామని, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా ఆ పని చేసిందా? కేంద్రంపై ఏ కేసులు పెట్టాల'ని మంత్రి నిలదీశారు. భాజపా మ్యానిఫెస్టోలో రూ.15 లక్షల హామీ ఉంటే ఏ శిక్షకైనా తాను సిద్ధమైనని మహేశ్వర్‌రెడ్డి బదులిచ్చారు. 'ఎన్నికల్లో గెలిచేందుకే అనేక హామీలిచ్చినట్లు సీఎం ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అలవికాని హామీలిచ్చి.. అమలు చేయట్లేదు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి శ్రీలంక, వెనెజువెలా లాగా మారుతుంది. యూపీఏలో చేరేందుకు భారాస ప్రయత్నిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు మంతనాలు జరిపాకే చెన్నైకి కేటీఆర్ వెళ్లారు. తెలంగాణలో భాజపా ఎదుగుతుందన్న భయంతోనే కాంగ్రెస్, భారాస దగ్గరవుతున్నాయి' అని ఏలేటి అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. ఇతర రాష్ట్రాలకే కేంద్రం ఎక్కువ పథకాలు ఇస్తోందని, దేశంలో తెలంగాణ భాగం కాదా? అని ప్రశ్నించారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా వైఖరేంటో ముందు చెప్పాలని పేర్కొన్నారు.

## సీఏ విద్యార్థులకు బిగ్ అలర్ట్..

(మొదటిపేజీ తరువాయి)



ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులకనుగుణంగా విద్యార్థులకు గొప్ప అవకాశాలను అందించేందుకు సీఏ ఫైనల్ పరీక్షల్ని సైతం ఏడాదిలో మూడుసార్లు నిర్వహించేలా చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ICAI ఓ ప్రకటనలో తెలిపింది. తాజా నిర్ణయంతో సీఏ ఫైనల్, ఇంటర్, ఫౌండేషన్ పరీక్షలు ఏడాదిలో మూడుసార్లు జరుగుతాయని పేర్కొంది. ఈ పరీక్షలు జనవరి, మే, సెప్టెంబర్ నెలల్లో జరుగుతాయని స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయని పేర్కొంది.

# నారాయణ పాఠశాలలో ఘనంగా అమ్మకు వందనం




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూరేటి నరసింహరావు అధ్యక్షతన అత్యంత వేడుకగా హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిని గౌరవంగా వేదిక వద్దకు తీసుకువచ్చి ఆమె కాళ్లు కడిగించడం అంటే బిడ్డలకు తల్లిని గౌరవించే సంస్కృతిని బోధించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మకు వందనం అనే స్లోగన్ ద్వారా విద్యార్థిని, విద్యార్థులు తమ మాతృమూర్తులకు పాదపూజ చేసి, శాలువా, పూలతో ఘనంగా సత్కరించి ఆశ్చర్యకరమైన బహుమతులు అందచేసి వారిపై తమ ప్రేమను చాటుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లితండ్రుల గొప్పతనాన్ని వివరిస్తూ, వారి ప్రేమపూర్వక ఆశీర్వచనాలు తీసుకోవడం అందరి హృదయాలను అమితంగా కదిలించింది. అనంతరం తల్లితండ్రులు మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలో తల్లితండ్రుల ప్రాముఖ్యతను తెలిపే ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం, ఈ వేదికపై తమ పిల్లల ప్రేమపూర్వక పలుకులు వింటుంటే తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, కన్నీళ్లు తుడుచుకుంటూ అనాదభాష్పలు వస్తున్నాయని హర్షం వ్యక్తం చేస్తూ నేటితరానికి ముఖ్యంగా తమ పిల్లలకు మానవతా విలువలు వృద్ధి చేసే ఈ అమ్మకు వందనం కార్యక్రమం అద్భుతమని నారాయణ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం నారాయణ పాఠశాలల ఏ.జీ.ఎం యోగ రాంకీ మాట్లాడుతూ అమ్మను గౌరవించడం వలన మన కుటుంబ వ్యవస్థ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్.ఐ క్రాంతి, ఈ టెక్నో కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈచాంప్స్ కోఆర్డినేటర్ వినోద, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, ఈటెక్నో ఏ.డి రామకృష్ణ, 10వ తరగతి ఇంచార్జి మల్లేష్, దీప్తి, అనూష, సుజిత్, రమేష్, సురేష్, కీర్తి, ప్రీతి, వినయ్, ఏ.వో వీర తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ ను సత్కరించిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పులి చంద్రమౌళి



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన ఇంద్రకర్ అనిత ను గురువారం రాజపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులి చంద్రమౌళి బృందం శాలువాతో సత్కరించారు. రాజపేట మండల తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఛాంబర్ లో అభినందనలు తెలుపుతూ సత్కరించగా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు రెడ్డి, జగదీష్, రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ తదితరులున్నారు.

## ముస్లిం సోదరులకు నిత్యావసర కిట్ల పంపిణీ



భువనగిరి రూరల్, ప్రజాస్ఫూర్తి : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు పాటిస్తున్న నిరుపేద ముస్లిం కుటుంబాలకు సామాజిక వేత్త, బి ఆర్ ఎస్ జిల్లా యువ నాయకులు జె వై జి ఫౌండేషన్ అధినేత జడల యశిల్ గౌడ్ సహకారంతో భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెం, బస్వపూర్ గ్రామాల్లో మాజీ గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకుల కిట్లను అందజేసేందుకు సహకరించిన జడల యశిల్ గౌడ్ కి ముస్లీం సోదరులు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమం చేయాలని కోరుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు,మాజీ వార్డు సభ్యులు,గ్రామస్తులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కు పాల్పడిన ముగ్గురు మైనర్లు అరెస్ట్

*** జువెనల్ హోమ్ కు తరలింపు**




శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : రోడ్డు పై వాకింగ్ చేస్తున్న వ్యక్తి మెడలో నుంచి గొలుసు లాకెళ్లిన ముగ్గురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి జువెనల్ హోమ్ కు తరలించారు. ఈనెల 23న రాత్రి 7 గంటల 45 నిమిషాల సమయం లో ముగ్గురు మైనర్ బాలలు ద్విచక్ర వాహనంపై చంద్రబాబు నాయుడు గెస్ట్ హౌస్ సమీప రోడ్డులో వెళ్తున్నారు. అదే రోడ్ లో నార్ని ఎస్టేట్ లెగ్జిరియో రెసిడెన్సి లో నివాసముంటున్న చోప్పారపు రాజా పూర్ణచందర్ రావు వాకింగ్ చేసి వెళ్తుండగా వెనుక నుండి ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై వచ్చి పూర్ణచందర్ రావు మెడలో నుండి గొలుసును లాక్కుని వెళ్లిపోయారు. దీంతో పూర్ణచందర్ రావు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. సి సి ఎస్, మియాపూర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిందితులైన ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించగా చైన్ స్నాచింగ్ కు పాల్పడింది తామేనని అంగీకరించారు. వారి వద్ద నుండి మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని వారిని జువైనాల్ హోమ్ కు తరలించినట్లు తెలిపారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కు వినతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : నాగార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యావపురం రవి, మొగిలి కరుణాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, స్ట్రీట్ లైట్లు, నిర్వహణ, పునర్నిర్మాణ పనులు, అంతర్గత రోడ్లలో ఏర్పడిన పాట్ హోల్స్ పనులను చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నాగార్జున నగర్ కాలనీకి ఎంతో చేశాము ఇంకా చేస్తామని అన్నారు. దశలవారీగా కాలనీ అభివృద్ధి తోడ్పాటును ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ నాగిల్ల బాల్రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభు గౌడ్, గద్దల క్రాంతి, ఎన్ ఎన్ కాలనీ ఉపాధ్యక్షులు బైరంకొండ గోపాల్ యాదవ్, సహాయ కోశాధికారి సాయి వివేక్, సంయుక్త కార్యదర్శులు శ్రీశైలం, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెడ్డి కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కమిటీ సభ్యులు బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ప్రతిజ్ఞ చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డి. బూమ్ రెడ్డి, చెప్యాలా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ... రెడ్డి కాలనీ సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తామన్నారు. కాలనీలో ప్రధానంగా మురుగు కాలువ అవుట్లెట్ సమస్యపై దృష్టి సారిస్తామన్నారు. కాలనీ నివాసుల అందరి సహకారంతో... కాలనీ అభివృద్ధికి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డి బూమ్ రెడ్డి, చెప్యాలా వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి సుదర్శన్, కోశాధికారిగా వి జీవన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎ. వెల్మారెడ్డి, ఎన్నికల అధికారులు కె. కృష్ణారెడ్డి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, బలరాం రెడ్డి, ప్రతినిధులు చెప్యాలా సురేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నర్సిరెడ్డి, వై. కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పేపర్ లీక్... ముగ్గురు ఉపాధ్యాయులపై వేటు

తెలంగాణలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు, పలు ప్రాంతాల్లో క్వశ్చన్ పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా నిన్న కామారెడ్డి జిల్లాలో పేపర్ లీక్ అయింది. జుక్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశ్నాపత్రంలోని కొన్ని ప్రశ్నలను సిబ్బంది లీక్ చేశారు. పరీక్షకు కొన్ని నిమిషాల ముందు కొన్ని ప్రశ్నలను కాగితంపై రాసి బయ టకు పంపారు. ఆ ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



## గుండెను తరలించేందుకు.. గుంటూరు-తిరుపతి గ్రీన్ ఛానల్

తిరుపతి: మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు గుంటూరు నుంచి తిరుపతికి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ఓ మహిళ గుండెను తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరులోని రమేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చెరుకూరి సుష్మ అనే మహిళ బ్రెయిన్ డెడ్ అయ్యారు. అవయవదానం చేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో గుంటూరు నుంచి గుండెను తిరుపతికి తరలించేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి యాజమాన్యం మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేసింది. వెంటే స్పందించిన మంత్రి.. గుండెను తరలించేందుకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా గన్నవరం విమానాశ్రయానికి గుండెను తరలించారు. గన్నవరం నుంచి రేణిగుంటకు, అక్కడి నుంచి తిరుపతి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త శ్రీనివాస్ మాట్లాడుతూ.. ''నా భార్య అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడ్డారు. కళ్లు తిరిగి పడిపోవడంతో కాలు, చెయ్యి పని చేయలేదు. వెంటనే రమేశ్ ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు చికిత్స అందించారు. కానీ, ఆమె కోమాలోకి వెళ్లారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు చెప్పారు. అవయవదానం వల్ల ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉందని సూచించారు. మా పిల్లలతో చర్చించి అవయవదానం చేయాలని నిర్ణయించుకున్నాం. ఆస్పత్రి యాజమాన్యం, మంత్రి నారా లోకేశ్ సహకారంతో తిరుపతిలో ఉన్న వారికి గుండె అందించడం చాలా సంతోషంగా ఉంది'' అని అన్నారు.

## ప్రధాని మోదీని కలిసిన ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్



దిల్లీ: ప్రధాని మోదీని ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కలిశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గురించి ప్రధానికి వివరిం చారు. రాజకీయ పరిస్థితులు, పార్టీ విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజు ప్రధాని మోదీని మర్యాద పూర్వకంగా కలిశారు.

## తెదేపా కార్యాలయంపై దాడి కేసు.. వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత



విజయవాడ: గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సీఐడీ కోర్టు కొట్టివేసింది. బెయిల్ ఇవ్వాలని కోరుతూ వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ సీఐడీ కోర్టులో గురువారం విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం.. వంశీ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వంశీతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లనూ న్యాయస్థానం కొట్టివేసింది.

## ఏపీగేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం.. అమలుకు టాస్క్ ఫోర్స్

అమరావతి: ఏపీబిల్‌గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. సుపరిపాలన, సాగులో ఏఐ సాంకేతికత, వైద్యారోగ్యం, జీవన ప్రమాణాల పెంపుపై ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్‌తో ఇటీవల ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. దీని అమలుపై మొత్తం 26 మంది అధికారులతో తాజాగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. మానవ వనరుల అభివృద్ధి, సాధారణ పరిపాలన శాఖతోపాటు, గ్రామవార్డు సచివాలయశాఖ కార్యదర్శులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఎంవోయూ కుదుర్చుకున్న అంశాల అమలును పర్యవేక్షించాల్సిందిగా టాస్క్ ఫోర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# అన్నపూర్ణ స్టూడియోస్ పేరిట మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు

* నటీనటులు, టెక్నీషియన్స్‌ను టార్గెట్ చేస్తున్న కేటుగాళ్లు
* డబ్బులు వసూలు చేస్తున్న మోసగాళ్లు
* ఫేక్ ఆఫర్స్‌ను నమ్మొద్దని అన్నపూర్ణ స్టూడియోస్ హెచ్చరిక
* అనుమానాలుంటే తమను సంప్రదించాలని సూచన

తమ పేరుతో కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ యాజమాన్యం పేర్కొంది. నటీనటులు, సాంకేతిక నిపుణులుగా అవకాశాలు కల్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని వెల్లడించింది. తమ సంస్థ ఎప్పుడూ ఎవరి దగ్గరా డబ్బులు వసూలు చేయదని స్పష్టం చేసింది. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, నిరుద్యోగులు, సినిమా అవకాశాల కోసం ఎదురు చూస్తున్న వారిని మోసగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్‌లో తెలిసిన వారున్నారని, సినిమా, సీరియల్ షూటింగ్‌లకు తీసుకెళ్లి నటింపజేస్తామని కొందరు




నమ్మబలుకుతున్నారు. ఈ మేరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని అన్నపూర్ణ స్టూడియోస్ హెచ్చరించింది. తమ సంస్థలో ఉద్యోగాలు, అవకాశాల పేరుతో వస్తున్న ఫేక్ వార్తలను నమ్మొద్దని సూచించింది. ఆడిషన్స్ లేదా ఇతరత్రా ప్రక్రియల కోసం తాము డబ్బులు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. ఎవరికైనా అనుమానాస్పద ఆఫర్లు వస్తే తమ అధికారిక మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించింది.

## దేవాదుల ప్రాజెక్టు అన్ని దశల పనులను పూర్తి చేస్తాం

* దేవాదుల ప్రాజెక్టు పంపులను ప్రారంభించిన మంత్రులు
* రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
* గత ప్రభుత్వం దేవాదులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపణ



దేవాదుల ప్రాజెక్టు అన్ని దశల పనులను ఈ సంవత్సరం చివరి నాటికి పూర్తి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ములుగు జిల్లాలోని దేవన్నపేట పంపుహౌస్ వద్ద ఆయన దేవాదుల ప్రాజెక్టు పంపులను ప్రారంభించారు. ఒక మోటార్‌ను ప్రారంభించి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీరు నేరుగా ధర్మసాగర్ రిజర్వాయర్లోకి చేరుకుంది. అనంతరం ఇరువురు మంత్రులు అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ సంవత్సరం చివరికల్లా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్

* రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న కేటీఆర్
* కాళేశ్వరంను కూలేశ్వరమని మంత్రులు అనడం సరికాదని వ్యాఖ్య
* గతంలో కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులతోనే నీటిని ఇవ్వవచ్చన్న రేవంత్ రెడ్డి





కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును 'కూలేశ్వరం' అంటూ మంత్రులు మాట్లాడటం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆలోచన లేకుండా భారీ ప్రాజెక్టును 'కూలేశ్వరం' అని సంబోధించవద్దని కేటీఆర్ హితవు పలికారు. కాళేశ్వరం కూలిపోయిందని చెబుతున్న ముఖ్యమంత్రే, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీరు తెస్తానని పేర్కొనడం విడ్డూరంగా ఉందని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కూలిపోతే కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, బస్వాపూర్ ప్రాజెక్టులు కూడా ఉండవని ఆయన స్పష్టం చేశారు. రైతులను పట్టించుకోవడం లేదన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా గోదావరి జలాలను వినియోగించే అవకాశం ఉందని ఆయన తేల్చి చెప్పారు. కమీషన్లు, ఫామ్ హౌస్‌ల కోసమే రీడిజైన్ల పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం పేరుతో ఎవరెన్ని అక్రమాలు చేశారో నిరూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇంకా ఎంత కాలం అబద్ధాలు చెబుతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో నిర్మించిన ప్రాజెక్టులతోనే సాగునీరు అందించవచ్చని, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు అవసరం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఈ ప్రాజెక్టులపై నిజనిర్ధారణ కమిటీ వేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై ఏకసభ్య కమిషన్ విచారణ జరుపుతోందని తెలిపారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదికను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో సభ్యుల ముందు ఉంచుతామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## తెలంగాణ శాసనసభ నిరవధిక వాయిదా

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నిరవధిక వాయిదా పడింది. మొత్తం 11 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు సాగాయి. 97 గంటల 32 నిమిషాల పాటు సభ కొనసాగింది. 12 బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు శాసనసభ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

## ట్రేడింగ్ పేరుతో మోసాలు.. వ్యక్తి అరెస్టు

హైదరాబాద్: స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన లలిత్‌కుమార్ జైస్వాల్.. మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిపై నిఘా ఉంచారు. గురువారం అతడిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి.. మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, 4 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా అతడిపై 16 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.





## కోకాపేట ట్రంపెట్.. కేక

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేటలో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ ప్రాంతాన్ని పక్కనే ఉన్న ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేస్తూ ట్రంపెట్ జంక్షన్ నిర్మించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్ మీదుగా 20 నిమిషాల్లోనే నియోపొలిస్ లేఅవుట్‌కు చేరుకునేలా.. 4 వరుసల్లో 1.27 కిలోమీటర్ల పొడవుతో రూపుదిద్దుకున్న ఈ ట్రంపెట్ జంక్షన్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## తెలంగాణ అసెంబ్లీలో కాగ్ నివేదిక.. ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టారు. 2023 24 ఆర్థిక ఏడాది ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించారు. ఇందులో 2023 24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని తెలిపారు. జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతంగా పేర్కొన్నారు. ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు అయింది. అదనంగా రూ.1,11,477 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

**కాగ్ నివేదిక ప్రకారం..**



* వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ ద్వారా రూ.10,156 కోట్లు తీసుకున్న ప్రభుత్వం
* రూ.35,425 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌ను 145 రోజుల పాటు వాడుకుంది
* 2023.. 24లో వడ్డీల చెల్లింపుల కోసం రూ.24,347 కోట్ల వ్యయం
* వేతనాలకు రూ.26,981 కోట్లు ఖర్చు
* ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.83 శాతం నిధులు
* 2023..24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు మొత్తం రూ.9,934 కోట్లు
* రెవెన్యూ రాబడుల్లో 45 శాతం వేతనాలు, వడ్డీ చెల్లింపులు, పింఛన్లకే ఖర్చు
* రెవెన్యూ మిగులు రూ.779 కోట్లు
* రెవెన్యూ లోటు రూ.49,977 కోట్లు, జీఎస్డీపీలో రెవెన్యూ లోటు 3.33 శాతం
* 2023..24 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు రుణాల మొత్తం 4,03,664 కోట్లు
* 2023..24 ముగిసే వరకు జీఎస్డీపీలో అప్పులు 27 శాతం
* 2023..24 వరకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.2,20,607 కోట్లు
* 2023..24లో మూలధనం కింద రూ.43,918 కోట్ల ఖర్చు
* స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773 కోట్లు
* స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో 11 శాతం పెరుగుదల

# తెలంగాణ అసెంబ్లీలో డీలిమిటేషన్ తీర్మానం.. స్పందించిన స్టాలిన్

* చెన్నైలో లేవనెత్తిన ఆకాంక్ష హైదరాబాద్‌లో నెరవేరిందన్న స్టాలిన్
* పారదర్శక డీలిమిటేషన్... న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని చాటుతుందని వెల్లడి
* తెలంగాణ దారిలో మిగతా రాష్ట్రాలు నడుస్తాయని ఆకాంక్షించిన స్టాలిన్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ తెలంగాణ శాసనసభ చేసిన తీర్మానంపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ స్పందించారు. చెన్నైలో లేవనెత్తిన ఆకాంక్ష హైదరాబాద్‌లో నెరవేరిందని ఆయన పేర్కొన్నారు. పారదర్శక డీలిమిటేషన్... న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని చాటుతుందని వ్యాఖ్యానించారు. కేంద్రం ప్రవేశపెట్టాలని భావిస్తున్న డీలిమిటేషన్ చట్టం ప్రజాస్వామ్య



సమతుల్యతను దెబ్బతీసే చర్యను బలోపేతం చేస్తుందని ఆయన విమర్శించారు. చెన్నైలో అఖిలపక్ష సమావేశం, తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం ఆరంభం మాత్రమేనని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం బాటను మిగతా రాష్ట్రాలు కూడా అనుసరిస్తాయని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో రెండో సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశం జరుగుతుందని స్టాలిన్ తెలిపారు. దేశ భవిష్యత్తును అన్యాయంగా మార్చడాన్ని తాము అనుమతించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం ఒక మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.

## కర్ణాటకలో పాల ధరలు.. లీటర్‌కు రూ.4 చొప్పున పెంపు!

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం నందిని పాల ఉత్పత్తుల ధరలను పెంచింది. లీటరుకు ఏకంగా రూ.4 చొప్పున పెంచినట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. పాలతో పాటు పెరుగుపై కూడా అంతే పెంచినట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వెల్లడించింది. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల ధరలను పెంచే అంశంపై చర్చించినట్లు మంత్రి కె. వెంకటేష్ వెల్లడించారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. లీటర్ పాలు, కేజీ పెరుగుపై రూ.4 పెంచేందుకు నిర్ణయించాం. ఏప్రిల్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. ఇకపై రాష్ట్రంలోని పాల ఉత్పత్తిదారులకు కొత్త రేట్లు నేరుగా ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకుంటాం. గతేడాది జూన్ 26న అమల్లోకి వచ్చిన లీటరుకు రూ.2 పెంపును ఉపసంహరిస్తున్నాం'' అని పేర్కొన్నారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నందిని బ్రాండ్ పాలు, వాటి ఉత్పత్తులపై రూ.5 పెంచాలంటూ డిమాండ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో




రాష్ట్ర సర్కారు రూ.4 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రైతులకు మద్దతు అందించేందుకు నూతన ధరలు అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమ వద్ద పాలు చౌకగా లభిస్తున్నాయని కేఎమ్ఎఫ్ పేర్కొంది. గత మూడేళ్లలో కేఎమ్ఎఫ్ పాల ధరలు ఇంత ఎక్కువ మొత్తంలో పెంచడం ఇదే తొలిసారి.

**పెంపు తర్వాత ధరలు ఇలా..**

* టోన్డ్ మిల్క్: లీటరుకు రూ.46 (గతంలో రూ. 42)
* హోమోజెనైజ్డ్ టోన్డ్ మిల్క్: రూ. 47 (గతంలో రూ.43)
* ఆవు పాలు (గ్రీన్ ప్యాకెట్): రూ. 50 (గతంలో రూ.46)
* శుభమ్ మిల్క్: రూ. 52 (గతంలో రూ.48)
* పెరుగు: రూ. 54 (గతంలో రూ. 50)

## ఎన్నికల్లో ఓటమితో నిరుత్సాహపడే వ్యక్తిని కాదు

ఒక ఎన్నికలో ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడే వ్యక్తిని కాదని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ తెలిపారు. భవిష్యత్తు ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దిల్లీలో నిర్వహించిన జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి పవార్ ప్రసంగిస్తూ.. పార్టీని బలోపేతం చేయాలని, ఎన్నికలు జరగనున్న బిహార్, కేరళ వంటి రాష్ట్రాలపై దృష్టి సారించాలని చెప్పారు. గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యూబీటీ), కాంగ్రెస్‌లతో కలిసి బరిలోకి దిగిన ఎన్సీపీ (ఎస్పీ).. తాను పోటీ చేసిన 86 సీట్లలో కేవలం 10 సీట్లకే పరిమితమైన విషయం



తెలిసిందే. ఈ ఫలితాల అనంతరం పార్టీ ఎక్స్‌టెండెడ్ వర్కింగ్ కమిటీ తొలి సమావేశం ఇది. నూతనోత్సాహంతో పని చేయాలని, భవిష్యత్తు సవాళ్లకు పార్టీని సిద్ధం చేయాలని పవార్ సూచించారు. ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా వ్యవసాయ రంగం పరిస్థితి దుర్భరంగా మారిందని విమర్శించారు. శాసనసభలో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని సమావేశంలో మాట్లాడిన పలువురు నేతలు ఆరోపించారు. రాష్ట్రంలో విద్వేషపూరిత ప్రసంగాలు పెరుగుతుండటం, నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఎదురయ్యే సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రను మత రాజకీయాలకు ప్రయోగశాలగా భాజపా మారుస్తోందని, ఇది ఆందోళనకర విషయమని పార్టీ సీనియర్ నేత జితేంద్ర అవ్హాడ్ ఆరోపించారు.

## సీఏ విద్యార్థులకు బిగ్ అలర్ట్.. ఇకపై ఫైనల్ పరీక్షలూ ఏడాదికి మూడుసార్లు

దిల్లీ: చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) పరీక్షలకు సంబంధించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. 2025 నుంచి సీఏ ఫైనల్ పరీక్షల్ని సైతం ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం CA Final exams ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది మార్చిలో సీఏ ఇంటర్, ఫౌండేషన్ కోర్సు పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఐసీఏఐ.. తాజాగా సీఐ ఫైనల్ పరీక్షలను సైతం అదే తరహాలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.




ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులకనుగుణంగా విద్యార్థులకు గొప్ప అవకాశాలను అందించేందుకు సీఏ ఫైనల్ పరీక్షల్ని సైతం ఏడాదిలో మూడుసార్లు నిర్వహించేలా చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ICAI ఓ ప్రకటనలో తెలిపింది. తాజా నిర్ణయంతో సీఏ ఫైనల్, ఇంటర్, ఫౌండేషన్ పరీక్షలు ఏడాదిలో మూడుసార్లు జరుగుతాయని పేర్కొంది. ఈ పరీక్షలు జనవరి, మే, సెప్టెంబర్ నెలల్లో జరుగుతాయని స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయని పేర్కొంది.

## 'వసుధైక కుటుంబం' అంటాం.. సొంతవారితోనే కలిసి ఉండలేకపోతున్నాం

**: సుప్రీం కోర్టు**

కుటుంబ వ్యవస్థ విషయంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారతీయులు 'వసుధైక కుటుంబం' అనే సూత్రాన్ని విశ్వసిస్తారని, కానీ.. సొంతవారితోనే కలిసి ఉండలేకపోతున్నారని పేర్కొంది. కుటుంబం అనే భావన దెబ్బతింటోందని, ఇది కాస్త 'ఒక వ్యక్తి ఒక కుటుంబం' అనే వ్యవస్థకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. తన పెద్ద కుమారుడిని ఇంటి నుంచి బయటకు పంపించాలని కోరుతూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ జిల్లాకు చెందిన కల్లూ మాల్, సంతోలా దేవీ దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారులకు, తల్లిదండ్రులకు మధ్య సత్సంబంధాల్లేవు. తమ కుమారుల నుంచి జీవనభృతి ఇప్పించాలంటూ 2017లో స్థానిక ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించగా.. తల్లిదండ్రులకు నెలకు రూ.8వేలు చెల్లించాలంటూ ఆదేశించింది. ఈ క్రమంలోనే పెద్ద కుమారుడికి, తల్లిదండ్రులకు మధ్య ఆస్తి వివాదం చెలరేగింది. ఇది కొనసాగుతుండగానే.. కల్లూ మాల్ మృతి చెందారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో తన పెద్ద కుమారుడిని ఇంటి నుంచి బయటకు పంపించాలని తల్లి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్



ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం దీన్ని విచారించింది. కుమారుడు తన తల్లిదండ్రులను, ముఖ్యంగా తల్లిని అవమానించాడని, ఆమె జీవితంలో జోక్యం చేసుకున్నాడని చెప్పేందుకు ఎటువంటి ఫిర్యాదులు, ఆధారాల్లేవని తెలిపింది. ఆస్తికి తండ్రే యజమాని అని చెప్పలేమని, కుమారుడికీ అందులో వాటా ఉంటుందని పేర్కొంది. కొడుకును ఇంటి నుంచి పంపించేంత తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ క్రమంలోనే కుటుంబ వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేసింది. ''మనమంతా 'వసుధైక కుటుంబం' అనే భావనను విశ్వసిస్తాం. అయితే, నేడు కుటుంబ ఐక్యతనే కాపాడుకోలేకపోతున్నాం. అలాంటిది.. 'ప్రపంచమంతా ఒకే కుటుంబం (వసుధైవ కుటుంబకం)' గురించి ఇంకేం మాట్లాడగలం? 'కుటుంబం' అనే భావనే తుడిచిపెట్టుకుపోతోంది. 'వన్ పర్సన్, వన్ ఫ్యామిలీ' (ఒక వ్యక్తి.. ఒకే కుటుంబం) అనే వ్యవస్థకు చేరువలో ఉన్నాం'' అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.

## భారత్.. అలాంటి వారికి ధర్మశాల కాదు

**: అమిత్ షా హెచ్చరిక**

దిల్లీ: ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు 2025కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడారు. విద్యా, వ్యాపార పరంగా భారత్‌లోకి విదేశీయులను ఆహ్వానిస్తామని అన్నారు. కానీ, దురుద్దేశంతో దేశంలోకి ప్రవేశించే వారి పట్ల కఠిన వైఖరితో ఉంటామని హెచ్చరించారు. ''విద్యా, వైద్యం, పర్యాటకం, వ్యాపారం చేయాలనుకునే విదేశీయులకు భారత్ రావాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుంది. దేశాభివృద్ధికి సహకరించే వారికి మేము ఎల్లప్పుడు సహకరిస్తాం. కానీ, దురాలోచనతో దేశంలోకి ప్రవేశించి.. హాని కలిగించాలనుకునే వారి పట్ల మోదీ సర్కారు కఠిన వైఖరి అవలంబిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని దేశంలో అడుగు పెట్టనివ్వం. అలాంటి వారికి మా దేశం ధర్మశాల కాదని గుర్తు పెట్టుకోవాలి'' అని



అమిత్ షా హెచ్చరించారు. ఈ బిల్లు భారత్ సందర్శించే ప్రతి విదేశీయుడి గురించిన మొత్తం సమాచారాన్ని స్వీకరిస్తుందని షా తెలిపారు. అక్రమంగా మయన్మార్ నుంచి దేశంలోకి వచ్చే రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల సంఖ్య పెరిగిపోయిందని.. వ్యక్తిగత ప్రయోజనాలతో లోనికి రానిస్తే అది భారత్‌కు సురక్షితం కాదని హితవు పలికారు. ఇమ్మిగ్రేషన్ బిల్లు దేశ భద్రతను పటిష్టం చేయడంతో పాటు 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లోని అధికార పార్టీ టీఎంసీపై అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు.

* **దీదీ ప్రభుత్వం వారికి సహకరిస్తోంది..**

''సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం అక్రమ చొరబాట్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చొరబాట్లను నివారించేందుకు కంచె ఏర్పాటు కోసం ఆ ప్రభుత్వం భూమిని కేటాయించలేకపోయింది. వారు చొరబాటుదారులపై దయ చూపుతున్నారు. అందుకే 450 కిలోమీటర్ల సరిహద్దులో కంచె వేసే పనులు పూర్తి కాలేదు. అక్రమ వలసదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కార్డులు అందించి వివిధ ప్రాంతాల్లో వారికి సౌకర్యాలు కల్పిస్తోంది. దక్షిణ 24 పరగణాలలో అధిక సంఖ్యలో ఆధార్ కార్డులను గుర్తించాం. కానీ ప్రజలు చింతించాల్సిన అవసరం లేదు. వచ్చే ఏడాది బెంగాల్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పాటు కాబోతుంది'' అని ధీమా వ్యక్తం చేశారు.

## నీట్, సీయూఈటీ ప్రిపరేషన్.. 1.63లక్షల మందికి దిల్లీ సర్కార్ ఉచిత శిక్షణ

దిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నీట్, సీయూఈటీ వంటి పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు దిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందుకోసం విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేలా బిగ్ ఇన్‌స్టిట్యూట్, ఫిజిక్స్‌వాలా లిమిటెడ్ సంస్థలతో అవగాహన ఒప్పందం చేసుకుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 12వ తరగతి చదువుతూ సీయూఈటీ, నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే దాదాపు 1.63లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. దిల్లీ డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, బిగ్ ఇన్‌స్టిట్యూట్, ఫిజిక్స్‌వాలాతో పాటు ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్, కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖలు సంయుక్త చొరవతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ మేరకు సీఎం రేఖాగుప్తా, విద్యాశాఖ మంత్రి ఆశీష్ సూద్ సమక్షంలో సంబంధిత విభాగాలకు చెందిన ప్రతినిధులు ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఏప్రిల్ 2 నుంచి మే 2వరకు రోజూ ఆరు గంటల చొప్పున విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులను కవర్ చేస్తూ ఆన్‌లైన్ బోధన కొనసాగించనున్నారు.



# బాడుగ పాత్ర

**ఓ గ్రామంలోని గుట్ట మీద ఈశ్వరాలయం ఉంది. చుట్టుపక్కల ఉన్న గ్రామస్థులు ప్రతి పౌర్ణమి రోజున అక్కడ చేరి పూజలు చేస్తారు. ఆలయ నిర్వాహకులు అతిథి ఉపన్యాసకులను పిలిపించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పిస్తూ ఉంటారు. వచ్చిన భక్తులు రాత్రంతా మేలుకుని భక్తి వాతావరణంలో కాలం గడుపుతుంటారు. భక్తులందరికీ స్థానికులు భోజన సదుపాయం కూడా ఏర్పాటుచేస్తారు.**

ఓ పౌర్ణమి రోజు యథావిధిగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. భోజన సమయం కావడంతో అందరికీ భోజనం వడ్డిస్తూ ఉన్నారు. ప్రవచనకర్త అందరినీ పలకరిస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాడు. చాలామంది తమకున్న ధర్మసందేహాలను ఆయన్ని అడిగి నివృత్తి చేసుకుంటున్నారు. అయితే వంట పనికి వచ్చిన ఒక మహిళ ఓ మూలగా కూర్చుని కన్నీళ్లు పెట్టుకోవడం గమనించాడు ప్రవచనకర్త.

ఆమె దగ్గరికి వెళ్లి 'ఎందుకు ఏడుస్తున్నావ'ని అడిగాడు. 'మా ఊరి మనిషి చనిపోయాడని తెలిసింది. అందుకని ఏడుస్తున్నాను' అని బాధగా బదులిచ్చిందామె. వెంటనే ప్రవచనకర్త ఆమెను 'ఇక్కడ వంట చేయడానికి పాత్రలు ఎక్కడివి?' అని అడిగాడు. 'ఇంతమందికి వంట చేయాలంటే పెద్ద పాత్రలు కావాలి కదా, మన ఇండ్లలో ఉండేవి సరిపోవు, అందుకని అంగడి నుంచి బాడుగకు తెచ్చాం' అని సమాధానమిచ్చింది. 'వీటితో పని అయిపోయాక ఈ పాత్రలను ఏం చేస్తారు?' అని మళ్లీ ప్రశ్నించాడు.

'శుభ్రం చేసి అంగడి వారికి తిరిగి ఇచ్చేస్తాం' అని జవాబిచ్చింది. అప్పుడు ప్రవచనకర్త 'వంట పాత్రల్ని బాడుగకు తీసుకువచ్చాం. వంటకి వాడుకున్నాం. వంట పని పూర్తి అయ్యాక తిరిగి వారికే ఇచ్చేస్తాం. మన శరీరం కూడా అంతే... మన శరీరాన్ని ఆశ్రయించిన ఆత్మ తన పని పూర్తి అయ్యాక చెప్పా పెట్టకుండా వెళ్లిపోతుంది. ఉండమన్నా ఉండదు. ఇది సహజమైన విషయం. రాజైనా, కూలీ అయినా అందరం పోయేవాళ్లే. కాకుంటే ముందూ, వెనుకా... అంతే! నదులు సముద్రంలో కలవడం సహజమే కదా. దానికి బాధపడటం ఎందుకు?' అని ధైర్యం చెప్పాడు. కళ్లు తుడుచుకుని ఆమె అక్కడినుంచి కదిలింది.

# వేరుశనగ గింజ

ఒక రైతు తన పదహారేండ్ల కొడుకును తీసుకుని గుడికి వెళ్లాడు. అక్కడ ఓ పండితుడు భగవద్గీత శ్లోకాలు చదివి వాటికి అర్థం చెబుతూ ఉన్నాడు. ఊరి జనమంతా అక్కడ పోగై ఉన్నారు. మంచి మాటలు నాలుగు చెవిలో వేసుకుందామని రైతు, తన కొడుకుతోపాటు అక్కడే కూర్చున్నాడు. కార్యక్రమం పూర్తయ్యాక ఇద్దరూ గుడిలోని దేవుడికి నమస్కరించి, ప్రసాదం తీసుకుని పొలాల మీదుగా ఇంటికి బయలుదేరారు. దారిలో కొడుకు 'ప్రేమించడం ఎందుకు మంచిది? కోపం ఎందుకు చెడ్డది?' అని ప్రశ్నించాడు. చిన్నగా నవ్విన తండ్రి అక్కడ ఉన్న వేరుశనగ తోటల్ని చూపాడు. 'ఒక్క వేరుశనగ గింజను మన భూమిలో నాటి నీళ్లు పోస్తే ఏమవుతుంది?' అని కొడుకును అడిగాడు. 'అది కూడా తెలియకుండా వ్యవసాయం చేస్తున్నానా! వేరుశనగ గింజ కొన్నాళ్లకు మొలకెత్తి మరో ఇరవై కాయలను మనకు అందిస్తుంది. అందులో ఒక్కో కాయకు రెండు నుంచి మూడు గింజలు వస్తాయి. అంటే ఓ గింజ, అరవై గింజలకు పైగా అవుతుంది' అని బదులిచ్చాడు. వెంటనే తండ్రి 'వేరుశనగ గింజను నాటి నీళ్లు పోయడం అనేది మనం ఇతరులను ప్రేమించడం లాంటిది. ప్రేమ అనే విత్తనాన్ని మన మనసులో నాటి దాన్ని ప్రోత్సహిస్తే అది వందలాది మధురమైన ఫలాలను ఇస్తుంది. అదే వేరుశనగ కాయను వేడి చేసి భూమిలో నాటి చూడు. ఎన్ని నీళ్లు పోసినా ఆ గింజ మొలకెత్తదు.

వేడి చేసేటప్పుడు గింజకు మరింత సెగ తగిలితే ఆ గింజ మాడి మసై పోతుంది. కోపం కూడా అంతే. మనల్ని కోపం ఆవహించినప్పుడు మంచీచెడ్డా తెలియదు. అది ఎదుటివారిని బాధపెట్టడమే కాకుండా మనం కూడా ఆ కోపానికి బలైపోతాం. అందుకే 'తన కోపమే తన శత్రువు, తన శాంతమే తన రక్ష' అని పెద్దలు చెబుతారు అని వివరించాడు. ప్రేమకు, కోపానికి వ్యత్యాసాన్ని తెలుసుకున్న కొడుకు తోటలోని ఓ వేరుశనగ మొక్కను పెరికి ఒక్కో గింజను కొరికి తింటూ తండ్రిని అనుసరించాడు.



# రంగులు మార్చే హైడ్రేంజా!




**పూల మొక్కలు నిండుగా విరబూస్తుంటే... ఆ ప్రదేశానికి వచ్చే కళే వేరు. ఇందుకు హైడ్రేంజా చక్కటి ఎంపిక. పెద్ద పెద్ద గుత్తులుగా... తెలుపు, గులాబీ, ఊదా, ఆకుపచ్చ, ఎరుపు వంటి రంగుల్లో పూస్తాయివి. మరి వీటిని మనమెలా పెంచుకోవాలో చూద్దామా!**

నేలలోని పీహెచ్ స్థాయిని బట్టి సీజన్‌తో పాటు రంగులు మార్చే పూల మొక్క హైడ్రేంజా. మట్టిలోని పీహెచ్ 5.5 కంటే తక్కువగా ఉంటే నీలం రంగులో, 6.5 కంటే అధికంగా ఉన్నప్పుడు గులాబీ ఛాయలో ఈ పూలు పూస్తాయి. అయితే, పీహెచ్‌ని బ్యాలెన్స్ చేయాలంటే మాత్రం అల్యూమినియం సల్ఫేట్, సున్నం, కాఫీ గింజలు, నిమ్మనారింజ తొక్కలు వంటివి వాడొచ్చు. పూల అందాన్ని రెట్టింపు చేసేలా దీని ఆకులు కూడా లేత ఆకుపచ్చ రంగులో పెద్దగా ఉంటాయి. వేసవిలో విరిసే హైడ్రేంజాకు ఆ పేరు గ్రీకు పదాలైన 'హైడర్' (నీరు) ఆంగోస్ (పాత్ర) నుంచి వచ్చింది. దీనికి నీటి పాత్ర అనే అర్థం ఉంది.

**కత్తిరిస్తే కొత్త పూలు...**

ఈ మొక్క ఒకప్పుడు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మేఘాలయ వంటి ఎత్తైన ప్రాంతాల్లో విరివిగా పెంచేవారు. ఇప్పుడు దక్షిణ భారత దేశంలోనూ చక్కగా పెంచేస్తున్నారు. వీటిని కాంతి ఎక్కువగా వచ్చే ఇంటిలోపలి స్థలాల్లో ఏర్పాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఎదుగుతాయి. ముఖ్యంగా ఉదయం సూర్యరశ్మి, మధ్యాహ్నం నీడ వచ్చేలా చూసుకోవాలి. బయట నాటినప్పుడు ఎండ ఎక్కువగా ఉంటే షేడ్‌నెట్ వేయాలి. అయితే, వీటిని నాటేందుకు పెద్ద కుండీలను ఎంచుకోవాలి. హైడ్రేంజాలకు నీరు నిలవని సారవంతమైన మట్టి అవసరం. నీళ్లు మాత్రం రోజు విడిచి రోజు వేర్లు తడిచేలా పోస్తే సరిపోతుంది. పూలు ఎక్కువ విరబూయాలంటే పొటాషియం ఎక్కువగా ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందించాలి. హైడ్రేంజాలు పూశాక వాటిని కత్తిరించడం మరిచిపోవద్దు. ఎందుకంటే ఆ పాత కొమ్మలకే కొత్త పూలూ వస్తాయి. హైడ్రేంజా మొక్కల్ని తెల్లదోమ, బూజు తెగులు, స్పైడర్ మైట్స్, ఆకుమచ్చలు వంటివి ఇబ్బంది పెడతాయి. వీటిని నివారించడానికి సర్ఫ్ వాటర్ చక్కగా ఉపయోగపడుతుంది. గాలి బాగా తగిలేలా చేసినా ఫలితం ఉంటుంది.





# రాణించిన బ్యాంకింగ్ షేర్లు..

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. ఆటో దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో మార్కెట్లు గురువారం ఉదయం నష్టాల్లో మొదలయ్యాయి. బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్లు కనిపించాయి. ఆటో, ఫార్మా, టెలికాం షేర్లు సహా మిగతా అన్నిరంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 77,087.39 పాయింట్ల వద్ద నష్టాల్లోనే మొదలైంది. ఇంట్రాడేలో 77,082.51 పాయింట్ల కనిష్ఠానికి చేరుకున్న సెన్సెక్స్.. గరిష్ఠంగా 77,747.46 పాయింట్లకు పెరిగింది. చివరలో 317.93 లాభంతో 77,606.43 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 105.10 పాయింట్లు లాభపడి 23,591.95 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. ట్రంప్ టారిఫ్‌లపై అనిశ్చితి కారణంగా ఫార్మా స్టాక్స్ ఒత్తిడికి గురయ్యాయి. ఆటో ఒకశాతం తగ్గగా.. ఫార్మా 0.4శాతం పతనమైంది. ఇక మిగతా అన్నిరంగాల సూచీలు పెరిగాయి. మీడియా, చమురు, గ్యాస్, రియాల్టీ ఒక్కొక్కటి ఒక శాతం వరకు పెరిగాయి. నిఫ్టీలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ లాభాలను ఆర్జించగా.. టాటా మోటార్స్, సన్ ఫార్మా, ఐషర్ మోటార్స్, మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయాయి. సోనా బీఎల్‌డబ్ల్యూ, హ్యాపీయెస్ట్ మైండ్స్, మెట్రో బ్రాండ్స్, మహీంద్రా లైఫ్, బజాజ్ ఎలక్ట్రికల్స్, జెన్సోల్ ఇంజినీరింగ్, వక్రంగీ, టీసీఐ ఎక్స్‌ప్రెస్, శివ సిమెంట్, రోలెక్స్ రింగ్స్, ఎక్స్‌ప్లియో సొల్యూషన్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్, సుయోగ్ టెలి, గెలాక్సీ సర్ఫ్యాక్టెంట్స్ తదితర 460 స్టాక్‌లు బీఎస్ఈలో 52 వారాల కనిష్ఠ స్థాయికి చేరుకుంది.

# హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్

## టాప్-10లో అంబానీకి దక్కని చోటు..



**న్యూఢిల్లీ:** హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2025 టాప్-10 సంపన్నుల జాబితాలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అబానీ స్థానం కోల్పోయారు. గత సంవత్సరంతో పోలిస్తే పెరిగిన అప్పుల కారణంగా అంబానీ సంపద రూ.లక్ష కోట్లు తగ్గింది. దాంతో ఆయన టాప్-10 నిష్క్రమించగా.. ఆసియాలో అత్యంత సంపన్నుడిగా తన స్థానాన్ని ఆయన నిలబెట్టుకున్నారు. ఈ జాబితాలో టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు. ఆయన మొత్తం సంపద ఊహించని విధంగా 82శాతం పెరిగి.. 420 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇక 266 బిలియన్ డాలర్ల సంపదతో అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ రెండోస్థానంలో ఉన్నారు. 242 బిలియన్ డాలర్లతో మెటా సీఈవో జుకర్‌బర్గ్ మూడో స్థానంలో ఉన్నారు. మరో వైపు రూ.3.5లక్షల కోట్ల సంపదతో హెచ్‌సీఎల్‌కు చెందిన రోష్ని నాడార్.. టాప్-10 సంపన్న మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆమె తండ్రి శివ్ నాడార్ ఇటీవల హెచ్‌ఎస్‌ఎల్ 47శాతం వాటాను ఆమె పేరిట బదిలీ చేయడంతో ఐదో స్థానానికి చేరుకున్నారు.

టాప్-10 జాబితాలో చోటు కోల్పోయిన ముఖేశ్ అంబానీ.. ఆసియాలో సంపన్నుడిగా కొనసాగుతున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇంధన, రిటైల్ వ్యాపారాలతో ఇబ్బందిపడుతున్నది. నష్టాల నేపథ్యంలో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ సంపద తగ్గింది. అలాగే, హురున్ జాబితాలో భారత్‌లో అంబానీ కుటుంబం తొలి స్థానంలో నిలిచింది. సంపద 13 శాతం తగ్గినా.. రూ.8.6 లక్షల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత గౌతమ్ అదానీ కుటుంబం రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరంలో అదానీ నిరకర విలువ దాదాపుగా రూ.లక్ష కోట్లు పెరిగింది. ప్రస్తుతం అదానీ కుటుంబం ఆస్తులు రూ.8.4లక్షల కోట్లు. రోష్ని నాడార్ కుటుంబం (రూ.3.5లక్షల కోట్లు), సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్‌కు చెంది దిలీప్ సంఘ్వీ కుటుంబం రూ.2.5 లక్షల కోట్లుగా ఉన్నది. ఆయన సంపద 21శాతం పెరగడంతో ఈ జాబితాలో ఐదోస్థానంలో నిలిచారు.

అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం (రూ.2.2 లక్షల కోట్లు), కుమార మంగళం బిర్లా కుటుంబం (రూ.2.0లక్షల కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సైరస్ పూనావాలా కుటుంబం (రూ.2లక్షల కోట్లు), నీరజ్ బజాజ్ ఫ్యామిలీ (రూ.1.6 లక్షల కోట్లు), రవి జైపురియా కుటుంబం (రూ.1.4 లక్షల కోట్లు) , రాధా కిషన్ దమానీ కుటుంబం (రూ.1.4లక్షల కోట్లు)తో టాప్-10లో చోటు దక్కించుకున్నారు. గత సంవత్సరంలో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య పెరిగి 284కు చేరింది. గతంలో బిలియనీర్ల జాబితాలో ఉన్న 27 మంది సంపద కోల్పోయినా.. మొత్తం సంపన్నుల సంఖ్య పెరగడం విశేషం. వీరి వద్ద మొత్తం ఉన్న సంపద రూ.98లక్షల కోట్లు. 90 మంది బిలియనీర్లతో ముంబయి అగ్రస్థానంలో కొనసాతున్నది. 'బిలియనీర్స్ క్యాపిటల్ ఆఫ్ ఆసియా' టైటిల్‌ని ముంబయి కోల్పోగా.. చైనాలో షాంఘై నగరం దక్కించుకున్నది.

# కేవైసీ నిబంధనలు..

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఆర్బీఐ భారీ ఫైన్




**న్యూఢిల్లీ:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షాక్ ఇచ్చింది. నిబంధనలు పాటించని కారణంగా భారీ ఫైన్ వేసింది. ఈ మేరకు ఆర్బీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

కేవైసీకి సంబంధించి 2016లో ఆర్బీఐ జారీ చేసిన మార్గదర్శకాలను పాటించని కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు రూ.75 లక్షల జరిమానా విధించినట్లు ప్రకటనలో వెల్లడించింది. 2023 మార్చి 31న బ్యాంకులో నిర్వహించిన పరిశీలనలో లోపాలను గుర్తించినట్లు పేర్కొంది. కస్టమర్లను రిస్కుల వారీగా విభజించకపోవడం, యునిక్ కస్టమర్ కోడ్ జారీ చేయాల్సిన చోట ఒకే ఐడెంటిఫికేషన్ కోడ్‌ను పలువురికి కేటాయించడం వంటి లోపాలను తాము గుర్తించినట్లు ఆర్బీఐ తెలిపింది.

# పూరన్, మార్ష్ విధ్వంసం..

## ఉప్పల్ స్టేడియంలో కంగుతిన్న సన్‌రైజర్స్



**హైదరాబాద్:** పొట్టి క్రికెట్‌లో ఎప్పుడు ఏ జట్టు చెలరేగి ఆడుతుందో చెప్పలేం. ఐపీఎల్‌లో రికార్డులు బద్దలు కొట్టిన టీమ్.. అనూహ్యంగా ఓటమి పాలవ్వడం చూశాం. తొలి మ్యాచ్‌లోనే రికార్డు స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఊహించని షాక్ తగిలింది. తొలి పోరులో రాజస్థాన్ రాయల్స్‌ను 44 పరుగుల తేడాతో ఓడించిన ఆరెంజ్ ఆర్మీ సొంత ఇలాకాలో ఓటమి పాలైంది. టాపార్డర్ వైఫల్యంతో భారీ స్కోర్ కొట్టలేకపోయిన కమిన్స్ సేన.. లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లను కట్టడి చేయడంలో విఫలమైంది.

190 పరుగు ఛేదనలో డేంజరస్ నికోలస్ పూరన్(70), ఓపెనర్ మిచెల్ మార్ష్(52)లు విధ్వంసంక అర్ధశతకాలతో చెలరేగారు. బౌండరీలతో ఉప్పల్ స్టేడియాన్ని హోరెత్తించిన ఈ ఇద్దరూ లక్నోను గెలుపు దిశగా నడిపారు. అబ్దుల్ సమద్(22నాటౌట్), డేవిడ్ మిల్లర్(13 నాటౌట్)లు ధాటిగా ఆడి లాంఛనాన్ని ముగించారు.. 5 వికెట్ల తేడాతో జయభేరి మోగించిన లక్నో 18వ సీజన్‌లో అదిరే బోణీ కొట్టింది.

### ఆకాశమే హద్దుగా..

పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సొంత మైదానంలో ఘోర పరాభవం. బ్యాటుతో విధ్వంసం సృష్టించే ఆటగాళ్లు ఈసారి చేతులెత్తేశారు. ట్రావిస్ హెడ్(47), అనికిత్ వర్మ(36)ల పోరాటంతో 190 పరుగులు చేసింది హైదరాబాద్. ఛేదనలో తన తొలి ఓవర్లోనే మహ్మద్ షమీ డేంజరస్ ఎడెన్ మర్క్‌రమ్(1)ను వెనక్కి పంపి బ్రేక్ ఇచ్చాడు. మిడాఫ్ దిశగా మర్క్‌రమ్ ఆడిన బంతిని అక్కడే కాచుకొని ఉన్న కమిన్స్ ఒడిసి పట్టుకున్నాడు. దాంతో, 4 పరుగుల వద్ద లక్నో మొదటి వికెట్ పడినా మిచెల్ మార్ష్(52), నికోలస్ పూరన్(70)లు ఆకాశమే హద్దుగా చెలరేగారు.

సిమర్‌జీత్ సింగ్ వేసిన ఓవర్లో పూరన్ 3 సిక్సర్లతో రెచ్చిపోయాడు. ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించి అర్ధ శతకంతో జట్టు విజయానికి బాటలు వేశాడు. పూరన్ ఔటయ్యాక మార్ష్ కెప్టెన్ రిషభ్ పంత్(15) ధాటిగా ఆడాడు. కానీ హర్షల్ పటేల్ వేసిన ఫుల్‌టాస్‌ను అంచనావేయలేక వెనుదిరిగాడు. అప్పటికీ లక్నో విజయానికి26 పరుగులు అవసరం కాగా.. అబ్దుల్ సమద్(22 నాటౌట్) 4, 6 బాదాడు. జంపాను టార్గెట్ చేస్తూ 6, 4 కొట్టాడు. డేవిడ్ మిల్లర్(13 నాటౌట్).. విజయం ఖాతాలో వేసుకుంది.

# గుజరాత్‌తో కీలక మ్యాచ్..

## బోటు షికారు చేస్తూ చిల్ అవుతున్న రోహిత్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో బోణీ కొట్టేందుకు సిద్ధమైంది ముంబై ఇండియన్స్. వరుసగా 13వ సారి ఐపీఎల్ తొలి పోరులో ఓటమి పాలైన ముంబై విజయమే లక్ష్యంగా శనివారం గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. కీలకమైన ఈ మ్యాచ్‌కు ముందు ఆ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ చిల్ అవుతూ కనిపించాడు.



గుజరాత్‌లోని జామానగర్‌లో బోటు షికారు చేస్తూ సరదాగా గడిపాడు టీమిండియా సారథి . అతడితో పాటు కుర్ర హిట్టర్ తిలక్ వర్మ, ముంబై టీమ్ సహాయక సిబ్బంది కూడా ఉన్నారు. వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా హిట్‌మ్యాన్ బోట్ రైడింగ్ చేస్తున్న ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి.

### ఏకంగా ఐదు ట్రోఫీలు

ఐపీఎల్ టోర్నీలో విజయవంతమైన కెప్టెన్‌గా పేరుగాంచిన రోహిత్ శర్మ ముంబైకి ఏకంగా ఐదు ట్రోఫీలు సాధించి పెట్టాడు. ఓపెనర్‌గా, సారథిగా ముంబై విజయాల్లో కీలక పాత్ర పోషించిన హిట్‌మ్యాన్.. గత సీజన్‌లో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. అతడి స్థానంలో హార్దిక్ పాండ్యా పగ్గాలు అందుకున్నాడు. అయితే.. 17వ ఎడిషన్‌లో ముంబై పేలవ ప్రదర్శన కనబరిచింది. 18వ సీజన్‌ను సైతం ముంబై ఓటమితో ఆరంభించింది.

### తొలి ఓవర్లోనే డకౌట్

మార్చి 23న చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలి ఓవర్లోనే డకౌట్‌గా వెనుదిరిగిన రోహిత్.. గుజరాత్‌పై చెలరేగేందుకు సిద్ధమవుతున్నాడు. మార్చి 29న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ముంబై, గుజరాత్‌లు తలపడనున్నాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్‌పై పోరాడి ఓడిన శుభ్‌మన్ గిల్ సేన.. తమ సొంత మైదానంలో పాండ్యా బృందానికి చెక్ పెట్టాలని భావిస్తోంది. దాంతో, ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరు అభిమానులను అలరించడం ఖాయం.

# వరల్డ్ కప్ విజేతలకు రికార్డు ప్రైజ్‌మనీ..

## 1,000 కోట్లు ఇవ్వనున్న ఫిఫా..!

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో జరుగబోయే క్లబ్ వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను దృష్టిలో పెట్టుకొని రికార్డు ప్రైజ్‌మనీ ప్రకటించింది. టైటిల్ పోరులో గెలుపొందిన జట్టుకు 125 మిలియన్ డాలర్ల(రూ.1000 కోట్లకు పైగా) నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపింది ఫిఫా. ఈ విషయాన్ని గురువారం అధ్యక్షుడు గియన్ని ఇన్‌ఫాంటినో అధికారికంగా వెల్లడించాడు. ఫిఫా వరల్డ్ కప్ విన్నర్‌కు ఇచ్చే మొత్తంతో పోల్చితే ఇది దాదాపు 10 రెట్లు అధికం కావడం విశేషం.

ఈ మెగా ఈవెంట్ ద్వారా వచ్చే రూ.84వేల కోట్ల ఆదాయాన్నిపాల్గొనే అన్ని జట్లకు పంపిణీ చేస్తామని ఇన్‌ఫాంటినో తెలిపాడు. అంతేకాదు ఇకపై ప్రతి నాలుగేళ్లకు ఓసారి క్లబ్ వరల్డ్ కప్ నిర్వహిస్తామని వెల్లడించాడు. 'అమెరికా వేదికగా జూన్‌లో క్లబ్ వరల్డ్ కప్ జరుగనుంది. ఈ నేపథ్యంలో అన్ని ఫుట్‌బాల్ క్లబ్స్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకున్నాం.

ఈ టోర్నీ సందర్భంగా ప్రకటనలు, ఫండింగ్ రూపంలో సమకూరే ఆదాయాన్ని పోటీ పడిన 32 క్లబ్స్‌కు సమంగా పంచుతాం. అంతేకాదు విజేతలకు రికార్డు స్థాయిలో 125 మిలియన్ డాలర్లు అంటే.. రూ.1000 కోట్లకు పైగా నగదు బహుమతి అందజేయనున్నాం' అని గియనీ ఇన్‌ఫాంటినో ఓ ప్రకటనలో వివరించాడు. లియోనల్ మెస్సీ, కిలియన్ ఎంబాపే, క్రిస్టియానో రొనాల్డో వంటి స్టార్ ఆటగాళ్లు తమ క్లబ్స్



తరపున ఈ టోర్నీలో పాల్గొననున్నారు.

### 11 నగరాల్లో..

ఈ ఏడాది జూన్ 15న ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. అమెరికాలోని 11 నగరాల్లోని స్టేడియాల్లో మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. నెలరోజుల పాటు జరిగే ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్ జూలై 15న జరుగనుంది. ఫిఫా వరల్డ్ కప్ మాదిరిగానే ఇకపై ప్రతి నాలుగేళ్లకు ఓసారి క్లబ్ వరల్డ్ కప్ నిర్వహించేందుకు ఫిఫా సన్నాహకాలు చేస్తోంది. అంతేకాదు ఈ టోర్నీలో మరిన్ని దేశాల క్లబ్స్‌ను భాగస్వామ్యం చేయాలని ఫిఫా భావిస్తోంది. జాతి వివక్షకు తావు లేకుండా అన్ని వర్గాల క్రీడాకారులను క్లబ్స్ వరల్డ్ కప్‌లో ఆడేలా చూడడమే తమ ఉద్దేశమని ఫిఫా అధ్యక్షుడు తెలిపాడు.

# కోహ్లీ, రోహిత్, జడ్డూకు ఝులక్

## సెంట్రల్ కాంట్రాక్టులో కోత తప్పదా..!

**న్యూఢిల్లీ:** భారత పురుషుల జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ఆటగాళ్లు క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలకు బీసీసీఐ షాక్ ఇవ్వనుంది. ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో కీలక మార్పులు చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 'ఏ ప్లస్' కేటగిరీలో ఉన్న వీళ్లను 2024-25 సీజన్‌లో డిమోట్ చేయడంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి సమాలోచనలు చేస్తోంది. సీనియర్లు అయిన కోహ్లీ, రోహిత్, జడ్డూల సెంట్రల్ కాంట్రాక్ట్ కుదింపు విషయం తెరపైకి రావడానికి కారణం ఏంటంటే..?

నిరుడు వెస్టిండీస్ గడ్డపై టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ గెలుపొందాక విరాట్, హిట్‌మ్యాన్‌లు పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఆల్‌రౌండర్ అయిన జడేజా సైతం వీళ్లను అనుసరిస్తూ వీడ్కోలుకు ఇంతకంటే మంచి సమయం, సందర్భం ఉండదని.. తాను టీ20లకు అల్విదా పలికాడు. దాంతో, అప్పట్నుంచీ ఈ ముగ్గురు వన్డే, టెస్టు జట్టులో మాత్రమే కొనసాగుతున్నారు.

అయితే.. బీసీసీఐ నిబంధనల ప్రకారం మూడు ఫార్మాట్లలో ఆడేవాళ్లకే ఏ ప్లస్ సెంట్రల్ కాంట్రాక్ట్ వర్తిస్తుంది. అందుకే..



ఈసారి వార్షిక కాంట్రాక్టుల జాబితాలో కోహ్లీ, రోహిత్, జడేజాలను ఏ ప్లస్ నుంచి ఏ గ్రేడ్‌కు మార్చే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే.. ప్రస్తుతం ఏటా రూ.7 కోట్లు ఆర్జిస్తున్న ఈ త్రిమూర్తులు.. ఇకపై రూ.5 కోట్లు మాత్రమే అందుకోనున్నారు. అయితే.. టీ20, వన్డే, టెస్టులు ఆడుతున్న పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఏ ప్లస్ కేటగిరీని నిలబెట్టుకుంటాడని సమాచారం.

### యశస్వీ, నితీశ్‌కు ప్రమోషన్

సీనియర్ల సెంట్రల్ కాంట్రాక్ట్ కుదింపుతో పాటు కుర్రాళ్లకు భారీగా ఆదాయం దక్కనుందని బీసీసీఐ వర్గాలు అంటున్నాయి. వన్డే జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్‌ను బీ కేటగిరీ నుంచి ఏ విభాగానికి మారనున్నాడు. ఏడాది కాలంగా నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌కు, అక్షర్ పటేల్‌కు బీ కేటగిరీలో చోటు ఖాయమంటున్నారు క్రికెట్ నిపుణులు.

ఐపీఎల్‌లో అదరగొట్టి భారత జట్టులోకి వచ్చిన.. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రానా, అభిషేక్ శర్మల పేర్లు కూడా సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఉండే వీలుంది. ఇక.. నిరుడు బీసీసీఐ ఆగ్రహానికి గురైన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు దేశవాళీలో, ఐపీఎల్ 18వ సీజన్‌లో దంచి కొడుతున్నారు. కాబట్టి ఈ ఇద్దరు మళ్లీ కాంట్రాక్ట్ దక్కించుకోవం పక్కా అనిపిస్తోంది. ఇప్పటికే మహిళా క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్ట్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.

## 'అలా జరగడానికి 9నెలలు పడుతుంది'..
# ఫ్యాన్స్‌కు అప్డేట్ ఇచ్చిన రష్మిక మందన్న

టాకీస్: ఓవైపు వరుస సినిమాలు, మరోవైపు ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా గడుపుతున్నారు అందాల తార రష్మిక మందన్న. ఈ క్రమంలోనే ఆమె కొన్ని రోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌కు దూరంగా ఉంటున్నారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ అభిమానులతో ముచ్చటించింది రష్మిక. వారు అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానాలు చెప్పింది. తన ఇష్టాయిష్టాలను షేర్ చేసుకుంది. దాంతోపాటు ఇటీవల తన కాలుకు గాయం కావడం పైనా రష్మిక మాట్లాడింది. తాను ఇప్పుడిప్పుడే ఆ గాయం నుంచి కోలుకుంటున్నానని ఫ్యాన్స్‌తో చెప్పారు. "కాలు ఇప్పుడిప్పుడే నయం అవుతోంది. కానీ పూర్తిగా సెట్ అవ్వడానికి ఇంకా 9నెలల సమయం పడుతుంది. కాకపోతే ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. వర్క్ లైఫ్‌లో ఫుల్ బిజీ అయిపోయా" అని ఓ అభిమానికి బదులిచ్చింది రష్మిక.

ఈ ఏడాది జనవరిలో రష్మిక గాయపడింది. జిమ్‌లో వర్కౌట్లు చేస్తుండగా తనకు గాయమైందని తెలిపుతూ ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది. ఆ తర్వాత కొన్నిరోజుల పాటు షూటింగ్‌లకు దూరంగా ఉంది. సినిమా ప్రమోషన్స్‌కు వీల్ చైర్‌లో హాజరయ్యారు. ఇటీవల రష్మిక నటించిన 'ఛావా' ఘన విజయాన్ని అందుకుంది. సల్మాన్ ఖాన్‌తో ఆమె యాక్ట్ చేసిన 'సికందర్' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి.

కుబేర సినిమా గురించి ఏదైనా అప్‌డేట్ ఇవ్వగలరు..

రష్మిక : సినిమా గురించి నాకు తెలిసిన ఒకేఒక్క అప్‌డేట్ రిలీజ్ డేట్. అది జూన్ 20న విడుదల కానుంది. చాలా డిఫరెంట్ సినిమా. మీలాగే నాక్కూడా సినిమా చూడాలని చాలా ఆశగా ఉంది.

కొరియన్ డ్రామాలు చూడాలనుకుంటున్నా. మీకు నచ్చినవి ఏమైనా ఉంటే చెప్పగలరు..

రష్మిక: ఇప్పుడే నేను 'లవ్ స్కాట్' అనే డ్రామా పూర్తి చేశాను. 'ఫస్ట్ ఫ్రాస్ట్' అనే చైనీస్ డ్రామా కూడా బాగుంటుంది. ప్రస్తుతం 'అండర్ కవర్ హైస్కూల్' చూస్తున్నా. ఇప్పటివరకూ ఎన్నో కొరియన్ డ్రామాలు చూశాను. అన్నీ నాకెంతో నచ్చాయి. ప్రత్యేకంగా ఒక దాని గురించి చెప్పాల్సివస్తే అది తప్పకుండా- 'ఓకే నాట్ టు బీ ఓకే'.

మీకు ఏమంటే భయం..

రష్మిక: ఎత్తు, నీటి లోతు ఎక్కువగా ఉండే ప్రదేశాలంటే నాకు చాలా భయం.




# రామ్ చరణ్ బర్త్‌డే గిఫ్ట్
# 'పెద్ది' మూవీ ఫస్ట్ లుక్




**టాకీస్:** మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది. గ్లోబల్ స్టార్ రాంచరణ్ అభిమానులకు శుభవార్త వచ్చేసింది. ఆర్సీ 16 పేరుతో సెట్స్ పై ఉన్న సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ ఖరారు చేసింది మూవీ యూనిట్. బుచ్చిబాబు దర్శకత్వంలో రాంచరణ్ తేజ్, జాన్వీకపూర్ జంటగా ఈ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. గురువారం రాంచరణ్ బర్త్ డే సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. నిజానికి గురువారం టీజర్ ప్లాన్ చేశారు. కానీ ఫైనల్ మిక్సింగ్, రీ రికార్డింగ్ లో జరిగిన ఆలస్యం వల్ల ఉగాది రోజు దాన్ని విడుదల చేసే అవకాశముంది. ప్రస్తుతం ఏఆర్ రెహమాన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫైనల్ చేసే పనిలో ఉన్నారు. కానీ ఫ్యాన్స్ కి టైటిల్ రివీల్ పోస్టర్ రూపంలో మంచి కానుక అందించింది టీం. ముందు నుంచి ప్రచారం జరిగినట్టే పెద్ది టైటిల్ అధికారికంగా లాకైపోయింది. నిఖార్సైన మాస్ లుక్ తో చేతిలో చుట్ట కాలుస్తూ రౌద్రం నిండిన కళ్ళతో రామ్ చరణ్ గెటప్ చూస్తుంటే రంగస్థలం సినిమాను మించి ఉంది. రెండో స్టిల్ లో జీన్స్ ప్యాంటు లో రఫ్ లుక్ లో క్రికెట్ బ్యాట్ పట్టుకోవడం నెక్స్ట్ లెవెల్. ఈ సినిమా విడుదల తేదీని ప్రస్తుతానికి రివీల్ చేయలేదు. టీజర్ లో ఉంటుందని సమాచారం. 2026 మార్చి 26 ఖరారయ్యిందనే లీక్ వచ్చింది. దానిపై చిత్ర బృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. శివకుమార్, జగపతి బాబు లాంటి ఆర్టిస్టులు ఈ సినిమాలో నటిస్తున్నారు.

## యాక్షన్ థ్రిల్లర్‌గా మమ్ముట్టి 'బజూక' ట్రైలర్

**టాకీస్:** మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి చాలా రోజుల తర్వాత మళ్లీ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బజూక'. ఈ సినిమాకు దీనో డెన్నిస్ దర్శకత్వం వహిస్తుండగా.. థియేటర్ ఆఫ్ డ్రీమ్స్, వై నాట్ స్టూడియోస్ బ్యానర్లపై డేవిన్ కురియకోస్, జిను వి అబ్రహం, విక్రమ్ మెహ్రా, సిద్ధార్థ్ ఆనంద్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నాడు.

యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను చూస్తే ఇది సీరియల్ కిల్లర్‌ను ఛేధించే కథాంశంతో రాబోతున్నట్లు తెలుస్తుంది. ట్రైలర్‌లో మమ్ముట్టి స్టైలిష్ లుక్‌లో, తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలతో కనిపించారు.






## గ్లామర్ డోస్ పెంచేసిన ముద్దుగుమ్మ.. ధన్య బాలకృష్ణ అదరగొట్టిందిగా..

టాకీస్: ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ నటించిన బాపు సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ నటించిన బాపు సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. పేరుకు సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది నటి ధన్య బాలకృష్ణ. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముద్దుగుమ్మ. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది. వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. తెలుగులో సాఫ్ట్ వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది. తాజాగా దాన్యబాలకృష్ణ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ధన్య బాలకృష్ణ ఫోటోల పై నెటిజన్స్ రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. హీరోయిన్స్ ను మించిన అందం మీది అంటూ కుర్రాళ్ళు కామెంట్స్ చేస్తున్నారు.

## మదిని దోచేస్తున్న
# 'రుహానీ శర్మ'

టాకీస్: చి.ల.సౌ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది రుహానీ శర్మ. తోలి చిత్రంతోనే ఆడియెన్స్ తో మంచి మార్కులు వేయించుకుంది రుహానీ శర్మ. అందం, అభినయం, చక్కటి నవ్వు, సొగసైన హొయలు రుహానీ శర్మ సొంతం. ఇక తర్వాత తెలుగులో 2020లో వచ్చిన 'హిట్' సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న ఈమె.. ఆ తర్వాత అదే ఏడాది 'డర్టీ హరి' సినిమాలో కూడా నటించింది. అంతేకాదు నూటొక్క జిల్లాల అందగాడు, హర్, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్ వంటి చిత్రాలలో నటించి మెప్పించింది. ఇక చివరిగా శ్రీరంగనీతులు సినిమాలో నటించి అబ్బురపరిచిన ఈమె.. ఇప్పుడు సోషల్ మీడియాలో నిత్యం ఆక్టివ్ గా ఉంటూ గ్లామర్ తో యువతను చంపేస్తోంది. తాజాగా పింక్ కలర్ ఫ్రాక్ ధరించిన ఈమె.. టాప్ అందాలతో భూమ్ అనిపించింది. మొత్తానికి అయితే రుహాని శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి.




## ఉస్తాద్ భగత్ సింగ్
# స్క్రిప్ట్ మొత్తం మార్చేశారా..

### ప్రొడ్యూసర్ ఇచ్చిన లీక్‌తో ఫ్యాన్స్ ఖుష్




**టాకీస్:** రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు సినిమాలు చేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఎలాంటి సినిమాలకి సైన్ చేయకపోయిన ఇంతకముందు కమిటైన సినిమాలు పూర్తి చేసే పనిలో ఉన్నాడు. అయితే పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో వచ్చిన గబ్బర్ సింగ్ చిత్రం పెద్ద హిట్ కావడంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్ మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి.. పవన్ కళ్యాణ్‌తో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి డైరెక్టర్ హరీష్ శంకర్ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నా కూడా పరిస్థితులు అనుకూలించడం లేదు.

అయితే ఈ సినిమా ఆగిపోయిందనే ప్రచారం కూడా ఇటీవల సాగింది. ఈ క్రమంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ 'రాబిన్ హుడ్' మూవీ ప్రమోషన్లలో మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అభిమానులకు కిక్కిచ్చే అప్డేట్ ఇచ్చారు. నెక్స్ట్ ఇయర్ మా ఆరవ సినిమాగా పవన్ కళ్యాణ్ సినిమా రిలీజ్ కాబోతోంది. పవన్ సినిమా అంటే ఏ పాన్ ఇండియా బజ్ కూడా సరిపోదు అని అన్నారు. హరిష్ శంకర్ ఇప్పటికే స్క్రిప్ట్ లాక్ చేసి పెట్టగా, కథ ఓ రేంజ్‌లో ఉంది. ఇక పవన్ కళ్యాణ్ ఎప్పుడు డేట్స్ ఇస్తారా అని మేము ఎదురు చూస్తున్నాము.

ఏది ఏమైన కూడా ఆ మూవీ షూటింగ్ ఈ ఏడాది పూర్తి చేసి వచ్చే ఏడాది రిలీజ్ చేస్తాము .2025 మైత్రికి ఓ ప్రెస్టీజియస్ ఇయర్ కాబోతోంది. ఈ మూవీతో మేము నెక్స్ట్ లెవెల్లో ఒక కొత్త అచీవ్మెంట్ అందుకోబోతున్నాం అంటూ మెగా ఫ్యాన్స్‌కి కిక్కిచ్చే న్యూస్ చెప్పారు నిర్మాత రవిశంకర్. అయితే నిర్మాత చెప్పిన ప్రకారం చూస్తే స్క్రిప్ట్ మాత్రం చాలా వరకు మార్చి కొత్తగా రూపొందించారని అనిపిస్తుంది. గతంలో ఉస్తాద్ భగత్ సింగ్ విజయ్ తేరి సినిమా రీమేక్ అని, ఎన్నికల ముందు పవన్ కి ఉపయోగపడేలా డైలాగ్స్ రాసుకున్నట్టు ప్రచారం జరిగింది. అయితే తేరి బాలీవుడ్ రీమేక్ ఫ్లాప్ అవ్వడంతో హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ స్క్రిప్ట్ మార్చి కొత్త స్క్రిప్ట్ రెడీ చేశాడనే ప్రచారం నడుస్తుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.